క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు

ముదినేపల్లి రూరల్: రెండోపూరీగా ప్రసిద్ధిచెందిన మండలంలోని వడాలి శ్రీ సుభద్ర, బలరామ సహిత శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. రోజూ ఉదయం విశేష అర్చన, తిరుప్పావై, విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 8న లక్షతులసి పూజ, 10న వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం, గ్రామోత్సవం, 12న ముగ్గుల పోటీలు, 13న భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణం, 14న మకర సంక్రాంతి సందర్భంగా గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

మంటాడలో..

పమిడిముక్కల: మండలంలోని మంటాడ వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

పామర్రు: దత్తాత్రేయ జయంతి వేడుకలను స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అనఘాదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి దంపతులు, ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను చేశారు.

మండవలిలో..

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు, సిద్ధ మంగళ స్తోత్రం నిర్వహించారు. అనంతరం అనఘాష్టమి వ్రతాలు వైభవంగా జరిపారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దత్తాత్రేయ స్వామికి పల్లకీ ఉత్సవం జరిపారు.

గజ వాహనంపై శ్రీనివాసుడి విహారం



గుడ్లవల్లేరు: డోకిపర్రు మహాక్షేత్రం శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వామివార్లకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్ల ఉత్సవ మూర్తులు గజ వాహనంపై విహరిస్తూ భక్తుల నుంచి పూజలను అందుకున్నారు. అనంతరం రథోత్సవం, ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, పి.ప్రసన్న, పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొల్లేటికోటలో మార్మోగిన పెద్దింట్లమ్మ నామస్మరణ



కైకలూరు: కొల్లేటికోట దేవస్థాన ప్రాంగణం పెద్దింట్లమ్మ నామస్మరణతో ఆదివారం మార్మోగింది. పెద్దింట్లమ్మ మాలధారణ దీక్షాపరులు పడి పూజను అమ్మవారి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సినీ సెట్టింగులను తలదన్నే విధంగా తయారు చేసిన మండపంలో అమ్మవారి ఉత్సవ ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనివేటి మండపం మొత్తం భక్తులతో నిండిపోయింది. అమ్మవారి భక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేవస్థాన ఈఓ కూచిపూడి శ్రీనివాసు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 20న జ్యోతి ఊరేగింపు, 26న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలోని అరవింద స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు, విద్యాభారతి కార్యదర్శి ప్రతాపసింహశాస్త్రి, దంత వైద్యురాలు డాక్టరు సింధు, అరవిందో విజ్ఞాన విహార స్కూల్ కరస్పాండెంట్ ఏ నాగార్జునరాజు పాల్గొన్నారు.

పరమ పవిత్రం.. ధనుర్మాసోత్సవం

నేటి నుంచి మీసాల వెంకన్నకు ప్రత్యేక పూజలు

నల్లటి మోముపై తెల్లని తిరునామాలు.. శంకు, చక్రాభరణాలు.. చక్కటి చిద్విలాసం.. కటి, అభయహస్తం.. ఇది కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుని చూడగానే భక్తులకు కలిగే భక్తిభావం. ఇందుకు భిన్నంగా కైకలూరులో భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి ముఖంపై మొనతేలిన మీసాలు, బొడ్డులో పొడవాటి కత్తి ఉండటం విశేషం. దీంతో మీసాల వెంకన్న ఆలయంగా ఇది పేర్గాంచింది. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు. సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయి.



మీసాల వెంకన్న స్వామి



ఆలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన వేంకటేశ్వరుని ప్రతిమ



కైకలూరులోని మీసాల వెంకన్న స్వామి ఆలయం

కైకలూరు: ఆరవీటి వంశీయులలో ప్రసిద్ధుడైన రామదేవరాయులు విజయానికి గుర్తుగా క్రీ.శ 1628లో మీసాల వెంకన్న ఆలయాన్ని నిర్మించారు. పౌరుషానికి గుర్తుగా వెంకన్నకు బొడ్డులో కత్తి, ముఖంపై మీసాలను ఏర్పాటు చేశారు. కైకలూరును అప్పట్లో కైంకర్యపురి అని పిలిచేవారు. ఆలయానికి ఏలూరు, అంతర్వేది, శ్రీకాకుళం, శోభనాచలం, కోరుకొండ క్షేత్రాలను హద్దులుగా నిర్ణయించారు. కైకలూరులో భవానమ్మ (ప్రస్తుతం గ్రామ తాగునీటి చెరువు) చెరువులో నీటిని స్వామి అభిషేకాలకు మాత్రమే ఉపయోగించాలని ఉంది. ఆలయం వద్ద తవ్వకాల్లో లభించిన శిలాశాసనంలో వివరాలు పొందిపర్చి ఉన్నాయి.

ధనుర్మాసోత్సవాలు ఇలా..

ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి 2025 జనవరి 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 26న ఏకాదశి సందర్భంగా లక్ష తులసి పూజ, జనవరి 10న ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం, జనవరి 13న గోదాదేవీ కల్యాణం జరగనున్నాయి. రోజూ తీర్థ బిందె, తిరుప్పావై ప్రవచనం, సహస్రనామార్చన, సాయంకాలార్చన, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, నిర్వహించనున్నారు.

మీసాల వెంకన్న ఆలయాల ప్రత్యేకత

మీసాల వెంకన్న ఆలయాలు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో ఉన్నప్పటికీ బొడ్డులో కత్తి ఉండటం కైకలూరులో ప్రత్యేకం. పాండిచ్చేరిలోని యానాం, కాకినాడ జిల్లా యండమూరు, ఖమ్మం జిల్లా కందుకూరు, మహబూబాబాద్ జిల్లా మర్రిగూడెం, గుంటూరు జిల్లా అనంతపురం, కడప జిల్లా బొమ్మెపల్లిలో మీసాల వెంకన్న ఆలయాలు ఉన్నాయి. అన్ని ఆలయాల్లోనూ ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



ఆలయంలో లభించిన శిలాశాసనం

ముక్కోటి రోజున విశ్వరూప దర్శనం



మీసాల వెంకన్న స్వామి పురాతన ఆలయ స్థానంలో అత్యంత వైభవంగా నూతన ఆలయాన్ని దేవదాయశాఖ నిర్మించింది. జనవరి 10న ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనమిస్తారు. ఆలయంలో ప్రహరీ ఏర్పాటు చేసి దేవతామూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన ఆర్చి పనులు జరుగుతున్నాయి.

– వీఎన్‌కే శేఖర్, ఆలయ కార్యనిర్వహణాధికారి, కైకలూరు

విజయం తథ్యం



రాయుల కాలంలో విజయాలకు గుర్తుగా వీర వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. ఎటువంటి వివాదాలైన మీసాల వెంకన్న స్వామిని దర్శించుకుంటే విజయం పొందుతారు. ఇక్కడ తవ్వకాల్లో గరుత్మంతుడి విగ్రహం లభించింది. ఇప్పటికీ భక్తులు చూడవచ్చు. స్వామి సన్నిధిలో పూరాతన ఆంజనేయ, నాగేంద్రుని గుడులు ఉన్నాయి. ధనుర్మాస ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి.

– అగ్నిహోత్రం ఉమాశంకరాచార్యులు, ఆలయ అర్చకులు, కైకలూరు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కైకలూరు: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల 19 వరకు జరిగే పోటీల్లో 45 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం దొడ్డిపట్ల, గోపవరం దీలిప్, కైకలూరు బ్రహ్మజీ, కైకలూరు బాలాజీ, కైకలూరు చిన్నచెరువుగట్టు – సీ జట్టు, బొమ్మినంపాడు, ఆటపాక మధు జట్లు విజయం సాధించాయి. అంపైర్లుగా ప్రసాద్, జయప్రకాష్(జేపీ) వ్యవహరించారు.

సాగునీటి సంఘ కార్యవర్గాలకు అభినందన

గుడ్లవల్లేరు: నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘ కార్యవర్గాలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు, లింగం చిట్టిబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ని జగన్, ఈడె కృష్ణారావు పాల్గొన్నారు.

గాయక బృందానికి నూతన వస్త్రాలు



గుడివాడ టౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చి గాయక బృందానికి నూతన వస్త్రాలు అందజేయడం అభినందనీయమని గుడ్‌మెన్ పేటలోని ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ ఎం.లూయిస్ రాజు అన్నారు. ఆదివారం చర్చి ఆరాధన అనంతరం నూతన వస్త్ర బహూకరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చి సభ్యుడు, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మెండా కిరణ్ ఆధ్వర్యంలో గాయకులతో పాటు వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కంచర్ల సుధాకర్, చర్చి కౌన్సిల్ సభ్యులు తోట బెనర్జి, బెజ్జం సువర్ణరాజు, డి. భూషణ్, ఎం. గాంధి, ఎం. సురేష్, ఉపదేశకులు ఎం.మరియదాసు, డి.దానియేల్ పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



గుడివాడలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాము, తదితరులు



పామర్రులో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్



వీరంకిలాకులో శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక వాసవిచౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రావి వెంకటేశ్వరరావు, అంబికా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి జరిగింది. అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఎకౌంట్స్ ఆఫీసర్ జీటీ నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వార్పురోడ్డులో అమరజీవి విగ్రహానికి వైశ్య ప్రముఖులు నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు కుంచపర్తి మురళి, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, వైశ్య ప్రముఖులు ప్రభాకరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: వీరంకిలాకులో మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరి పూర్ణచంద్రరావు, పాత్తూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఏఓ రామకృష్ణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

పామర్రులో. .

పామర్రు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఆదర్శనీయమని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ కార్యాలయంలో శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నందిపాటి సాంబిరెడ్డి, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..



కైకలూరులో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని, ఆర్యవైశ్య నాయకులు

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు భవిరిశెట్టి రంగారావు, కార్యదర్శి పోకూరి కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి నంబూరి తాండవ కృష్ణకుమార్ దేసు శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ శివనారాయణ, కోశాధికారి వెంకట సుబ్బారావు, దేవస్థానం చైర్మన్ ఉదయ సూర్యసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

కైకలూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం అని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆర్యవైశ్యులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఆర్యవైశ్య ప్రముఖులు మాల్యాద్రి, పైడిమర్రి రాధాకృష్ణ పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తోట్లవల్లూరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



పాల పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చండీ హోమం

వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం చండీ హోమాన్ని నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో కలశ జ్యోతుల ఊరేగింపు



గుడ్లవల్లేరులో కలశ జ్యోతులతో భారీ ర్యాలీగా భవానీలు, మహిళా భక్తులు



మండవల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భవానీ దీక్షాధారులు

గుడ్లవల్లేరు: కూరాడ లాకు డౌన్‌లోని శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారికి భవానీ మాలధారులు, మహిళా భక్తులు భక్తి ప్రపత్తులతో కలశ జ్యోతులను ఊరేగించారు. వందలాది మంది భక్తులు ఈ జ్యోతులతో నిర్వహించిన ఊరేగింపు అందర్నీ ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో శనివారం రాత్రి భవాని దీక్షాధారులు అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం దివ్య జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. దుష్ట శక్తులు దూరంగా ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దీక్షాధారులు తెలిపారు.

పామర్రులో..

పామర్రు: భవానీ దీక్ష పూర్తిచేసిన భవానీలు ఘనంగా కలశ జ్యోతుల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక గంగానమ్మ ఆలయం వద్ద నుంచి ప్రారంభమై శివాలయం, జమ్మిచెట్టు సెంటర్, గుడివాడరోడ్డు మీదుగా స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి విజయవాడ కనకదుర్గ దేవి ఆలయానికి పయనమయ్యారు.



పామర్రులో కలశ జ్యోతులతో ఊరేగుతున్న భవానీ దీక్షధారులు

షష్ఠి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణ సింగరాయపాలెం సెంటర్ భక్తుల రద్దీతో నిండిపోయింది. స్వామివారి పుట్టలో పాలు పోసేందుకు ఏర్పాటుచేసి క్యూలు, స్వామివారి సాధారణ, ప్రత్యేక దర్శన క్యూలు నిండిపోవడంతో భక్తులు అధిక సమయం వేచిఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద పూజలు చేసేందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు అదనపు ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, పాలకవర్గసభ్యులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు సింగరాయపాలెం సెంటర్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు శ్రమించాల్సి వచ్చింది. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఆదివారం పూర్ణాహుతి, అవభృతస్నానం, త్రిశూలేశ్వరస్వామి స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో పలువురు యాజ్ఞికులు ఈ కార్యక్రమాలను నిర్వహించగా సహాయ కమిషనర్, పాలకవర్గ సభ్యులు పూజలు చేశారు.



క్యూలో ఉన్న భక్తులు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆనంద్‌రెడ్డి ప్రతిభ



పామర్రు: ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కనుమూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్‌రెడ్డి ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. ఈ నెల 14,15 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ట్రిపుల్ జంప్ లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డుమెడల్ సాధించారు. జావలిన్ త్రో పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్‌మెడల్, షార్టు పుట్‌లో బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. పామర్రు నియోజకవర్గ గేమ్స్ ఇన్‌చార్జి జవహర్‌బాబు ఆనంద్‌రెడ్డిని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండవల్లి: ఆస్పత్రిలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండవల్లికి చెందిన వీరమల్లు వెంకట దుర్గ మల్లేశ్వరరావు(49) చిట్టీల వ్యాపారంలో నష్టం రావడంతో పాడుకున్న వారికి తిరిగి చెల్లించేందుకు అప్పులు తెచ్చాడు. ఇంకా డబ్బులు సరిపోకపోవడంతో మానసిక వేదనకు గురైన అతడు ఈనెల 13వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు అతడ్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య అరుణశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.